## క్లుప్తంగా

### ఇందిరమ్మ ఇంటి పరిశీలన



**నవాబుపేట:** జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చొరవతో మండలంలోని దేపల్లికి 107 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. గురువారం ఇంటి నిర్మాణాలకు భూమిపూజ చేసుకున్న లబ్ధిదారులు.. మహబూబ్‌నగర్ మండలం ఓబ్లాయిపల్లిలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ డీఈ నర్సింహులు లబ్ధిదారులకు దశల వారీగా ఇంటి నిర్మాణానికి బిల్లుల మంజూరు వివరాలను వివరించారు. కార్యక్రమంలో దేపల్లి వెంకటేశ్, రాములు, రాజు, రమేశ్, వెంకటయ్య, భూషమయ్య పాల్గొన్నారు.

### పూలే, అంబేడ్కర్ జాతర కమిటీ చైర్మన్‌గా లక్ష్మణ్

**మహబూబ్‌నగర్ రూరల్:** పూలే, అంబేడ్కర్ 5వ జాతర ఆర్థిక వనరుల ఉమ్మడి జిల్లా కమిటీ చైర్మన్‌గా గువ్వల లక్ష్మణ్, కోచైర్మన్లుగా నాచ శ్రీనివాస్ యాదవ్, కేతావత్ యాదగిరి నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకుల సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జాతర వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింహులు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాలరాజు, గండి బాలరాజు, కృష్ణయ్య, మాసయ్య, వెంకటయ్య, కావలి జంగయ్య, ఆశన్న, నర్సింహులు పాల్గొన్నారు.

### టాస్ కోఆర్డినేటర్‌ను తొలగించాలని ధర్నా



**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** టాస్ జిల్లా కోఆర్డినేటర్‌గా అక్రమంగా నియమితులైన శివయ్యను వెంటనే ఆ పోస్టు నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గురువారం గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టీజీఏ జిల్లా అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. లోకల్ బాడీ మేనేజ్‌మెంట్ ప్రకారం ఆయన నియామకం అక్రమమని తెలిపారు. ఈ విషయంపై అనేక మార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపించారు. అక్రమంగా నియమితులైన అతడిని వెంటనే తొలగించి దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వ యాజమాన్యంలోని స్కూల్‌లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరారు. అనంతరం కలెక్టర్ విజయేందిర, డీఈఓ ప్రవీణ్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో జీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి సంబు కిషోర్, అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్రాములు, గౌరవాధ్యక్షుడు సేవియా నాయక్, ఉపాధ్యక్షుడు వెంకట్‌స్వామి, కోశాధికారి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### మహనీయుల చిత్రపటాల తొలగింపుపై ఆందోళన

**దేవరకద్ర:** మండల కేంద్రంలోని డీసీసీ బ్యాంకులో మహాత్మాగాంధీ, అంబేడ్కర్, వేంకటేశ్వరస్వామి చిత్రపటాలను తొలగించి ఓ మూలకు పెట్టారు. విషయం తెలుసుకున్న అంబేడ్కర్ నగర్ వాసులు గురువారం బ్యాంకు వద్దకు వెళ్లి మేనేజర్ యూసుఫ్‌ను నిలదీశారు. మహనీయుల చిత్రపటాల తొలగింపుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ ఫొటోలను యథాస్థానంలో ఉంచాలని పట్టుపట్టారు. దీంతో మేనేజర్ దిగివచ్చి అంబేడ్కర్, గాంధీజీ, వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను తిరిగి గోడకు తగిలించి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దొబ్బలి ఆంజనేయులు, వార్డు సభ్యుడు చెన్నప్ప, గోపి బాలరాజు, కోట ప్రదీప్, ఎల్లస్వామి, రాజు, రామాంజనేయులు ఉన్నారు.

### నిర్భయంగా పరీక్షలు రాయాలి




**రాజాపూర్:** పదో తరగతి విద్యార్థులు నిర్భయంగా వార్షిక పరీక్షలు రాస్తేనే మంచి ఫలితాలు సాధిస్తారని సీఎంఓ బాలుయాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో ప్రతి విద్యార్థి మంచి గేడ్‌తో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్, హెచ్‌ఎం శ్రీనివాస్, రిటైర్డ్ హెచ్‌ఎం ఆనంద్ పాల్గొన్నారు.

# అవగాహనతోనే విపత్తుల నివారణ

- ఆపద మిత్రలు ముఖ్యభూమిక పోషించాలి
- కలెక్టర్ విజయేందిర బోయి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయేందిర బోయి, ఇతర అధికారులు

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** సహజ, మానవ కల్పిత విపత్తులను నివారించడంపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన అవసరమని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఆపద మిత్రలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. జాతీయ విపత్తుల నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో 300 మంది వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రకృతి, మానవ కల్పిత విపత్తులు జరిగినప్పుడు అధికారులు ఘటనా స్థలానికి చేరుకునేలోగా.. పౌరులే స్వీయ రక్షణ పద్ధతులు పాటిస్తూ ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆపద మిత్రలు ముఖ్యభూమిక పోషించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ నర్సింహులు, డీఎఫ్‌ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఏటీసీ సెంటర్ల ఏర్పాటు..**

యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణశాఖ ఆధ్వర్యంలో కొత్తగా గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ) ఏర్పాటు చేయాలని సంకల్పించిందని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన జూమ్ మీటింగ్ ద్వారా కలెక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ సెగ్మెంట్‌లో కనీసం ఒక ఏటీసీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఏటీసీ సెంటర్ల నిర్మాణానికి అనువైన ప్రదేశం, స్థలాన్ని గుర్తించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రధాన రహదారులు, పరిశ్రమలకు చేరువలో ఏటీసీల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జూమ్ మీటింగ్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ శాంతయ్య పాల్గొన్నారు.

**రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి**

ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ తదితర వాటితో ముడిపడిన అంశాలపై చర్చించేందుకు వీలుగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ సూచించారు. గురువారం కలెక్టర్, ఈఆర్‌ఓలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో చర్చించిన అంశాలు, చేసిన తీర్మానాలను సీఈఓ కార్యాలయంతో పాటు గుర్తింపు పొందిన పార్టీల ప్రధాన కార్యాలయాలకు పంపించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించి కొత్తగా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ నవీన్ ఉన్నారు.

## ఇసుక టిప్పర్, ట్రాక్టర్ సీజ్

**నవాబుపేట:** మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక టిప్పర్, ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ గురువారం తెలిపారు. కిష్టారం గ్రామ శివారు నుంచి రుద్రారం గ్రామానికి టిప్పర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా.. పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన కిష్టారం గ్రామానికి చెందిన గొడుగు యాదయ్యపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. అదే విధంగా కొండాపూర్ శివారులో చాకలిపల్లి నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మేకల రఘుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## కుచ్చర్‌కల్‌లో మంటలు

**రాజాపూర్:** మండలంలోని కుచ్చర్‌కల్ శివారులో ఉన్న గుండంబాయి వద్ద గురువారం మంటలు చెలరేగాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడటంతో మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

## ప్రభుత్వం ఆదుకోవాలి



**దేవరకద్ర:** కోయిల్‌సాగర్ నుంచి సాగునీరందక గూరకొండ, పెద్దగోప్లాపూర్ గ్రామాల శివారులో ఎండిన వరిపంటను గురువారం తహసీల్దార్ కృష్ణయ్య, ఏఓ రాజేందర్ అగర్వాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును అధికారులతో వెల్లబోసుకున్నారు. కోయిల్‌సాగర్ నుంచి సక్రమంగా నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయాయని.. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



**గండేడ్:** అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలో వెన్నాచేడ్, గండేడ్, సల్కర్‌పేట్ తదితర గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద కుటుంబాలకు బాసటగా నిలవాలన్న సంకల్పంతో కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీటీ మాధవి, ఆర్‌ఐ యాసిన్, రికార్డు అసిస్టెంట్ రుక్మిణి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, సత్యయ్య పాల్గొన్నారు.

## గ్రూప్–1లో జడ్చర్ల విద్యార్థి ప్రతిభ



**జడ్చర్ల టౌన్:** ఇటీవల విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో జడ్చర్ల పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీకి చెందిన విద్యార్థిని చింతకుంట నవీన 510.5 మార్కులు సాధించారు. ఆమె తండ్రి సత్యారెడ్డి ప్రైవేటు ఉద్యోగి కాగా.. తల్లి సత్యమ్మ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. సివిల్స్ సాధించి ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో చదువుతున్నట్లు నవీన్ తెలిపారు.

## ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి



జిల్లా కేంద్రంలో మొల్లమాంబ చిత్రపటం నివాళులర్పిస్తున్న సంఘాల ప్రతినిధులు

**స్టేషన్ మహబూబ్‌నగర్/జడ్చర్ల/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** జిల్లా కేంద్రంలోని ఉమ్మడి బీసీ సమాజ్ కార్యాలయంలో గురువారం తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్, కుల సంఘాల ప్రతినిధులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాన్య కుటుంబంలో జన్మించిన మొల్లమాంబ.. రామాయణం సులభంగా అందరికీ అర్థమయ్యే విధంగా తెలుగులో రచించి కీర్తి గడించారన్నారు. మొల్లశైలి చాలా రమణీయంగా, సరళమైనదిగా ఉండేదన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, అశ్విని సత్యం, దుర్గేష్, బి.శేఖర్, విశ్వనాథ్, శంకర్ నాయి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

■ జడ్చర్ల అంబేడ్కర్ చౌరస్తాలో తెలుగు తొలి కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నవనీత మాట్లాడుతూ.. మొల్లమాంబ తెలుగులో రచించిన రామాయణం చరిత్రలో నిలిచిపోయిందని కొనియాడారు. ఆమె జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.

■ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో మొల్లమాంబ విగ్రహానికి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్‌కుమార్, కుమ్మరి సంఘం నాయకులు బుగ్గన్న, రాంచంద్రయ్య, ఎల్లప్ప, రాజశేఖర్, నాగప్ప, రవికుమార్ పాల్గొన్నారు.

## వైభవంగా ఆది బసవేశ్వరస్వామి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఆది బసవేశ్వరస్వామి

**నవాబుపేట:** మండలంలోని గురుకుంట, పల్లెగడ్డ సమీపంలో వెలసిన స్వయంభూ ఆది బసవేశ్వర స్వామి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రభోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో గురుకుంట, పల్లెగడ్డ, కామారం, పోమాల్, దరిపల్లి తదితర గ్రామాల ప్రజలు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే జిల్లాస్థాయి భజన, వాలీబాల్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఎస్‌ఐ విక్రమ్ విడుదల చేశారు. వారం రోజులపాటు జరిగే ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ నెల 15న ఆలయ ప్రాంగణంలో భజన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా పల్లెగడ్డ యూత్ ఆధ్వర్యంలో 16, 17 తేదీల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త భూపాల్‌రెడ్డి, పూజారి శ్రీశైలం, జంగయ్య, రాజలింగం, ప్రతాప్, రవి, శ్రీను, చంద్రకాంత్, శ్రీనివాస్, బాల్‌రాజు, జంగయ్య, గోపాల్, చెన్నయ్య, వెంకటేశ్, రాజు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి



లింగంపేటలో సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

**జడ్చర్ల:** గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించడంతో పాటు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని లింగంపేటలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వేతో సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఇందిరమ్మ పథకానికి 150 మంది దరఖాస్తు చేసుకుంటే.. కేవలం 32 మందికి మాత్రమే మంజూరు చేయడం అభ్యంతరకరమన్నారు. ఇక రైతు భరోసా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఉపాధి హామీ పనులు సవ్యంగా ముందుకు సాగక పోవడంతో చాలా మంది కూలీలకు ఉపాధి కరువైందన్నారు. మురుగు కాల్వలు, సీసీరోడ్లు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జగన్, సాయిలు, యాదయ్య, శ్యాంసుందర్, నర్సింహులు, విజయ్ పాల్గొన్నారు.

## ఘనంగా హోలీ వేడుకలు

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/జడ్చర్ల టౌన్:** జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఎకో ఫ్రెండ్లీ హోలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు మాట్లాడుతూ.. పర్యావరణహితంగా హోలీ పండగ నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేంద్రబాబు, వైస్ ప్రిన్సిపల్ అమీనా ముంతాజ్, శ్రీదేవి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ జడ్చర్ల పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సహజ రంగులు చల్లుకొని హోలీ ఆడారు. పాఠశాల ప్రధానాచార్యులు వెంకటయ్య హోలీ విశిష్టతను తెలియజేశారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



చెన్నారెడ్డిపల్లిలో ఉపాధ్యాయులైన విద్యార్థులు



భూత్పూర్ పాఠశాలలో..

**జడ్చర్ల టౌన్/భూత్పూర్/నవాబుపేట/అడ్డాకుల:** జడ్చర్ల మండలంలోని రామస్వామిగుట్టతండా, భూత్పూర్ మున్సిపాలిటీ, నవాబుపేట మండలంలోని చెన్నరెడ్డిపల్లి, చౌడూర్, తీగలపల్లి, అడ్డాకుల మండలం రాచాల ప్రాథమిక పాఠశాలల్లో గురువారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠ్యాంశాలు బోధించారు. కార్యక్రమాల్లో ఎంఈఓ కురుమూర్తి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

# ఆక్రమణల తొలగింపునకు చర్యలు



ఆక్రమణలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి

**జడ్చర్ల టౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని.. లేనిపక్షంలో చర్యలు తప్పవని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి అన్నారు. కౌన్సిలర్ రఘురాంగౌడ్ విజ్ఞప్తి మేరకు గురువారం 12వ వార్డులోని 167వ నంబర్ జాతీయ రహదారి పొడవునా ఉన్న ఆక్రమణలను వారు పరిశీలించారు. ఓ హోటల్ ఎదుట రోడ్డుపై ఏర్పాటు చేసిన హలీస్ విక్రయ కేంద్రాన్ని వెంటనే తొలగించాలని నిర్వాహకులను ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్, మురుగు కాల్వల ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్‌కు సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ దుకాణ కాంప్లెక్స్ ఎదుట ఆక్రమణలను పరిశీలించారు. ఆక్రమణల తొలగింపు సమయంలో సంబంధిత వార్డు కౌన్సిలర్లు సహకరించాలని వారు కోరారు. అనంతరం హైస్కూల్ వద్ద చేపట్టిన రోడ్డు పనులతో పాటు 3వ వార్డులో పదిశాతం భూములను వారు పరిశీలించారు. మున్సిపాలిటీలోని 10 శాతం భూముల చుట్టూ ప్రహరీ నిర్మించనున్నట్లు తెలిపారు. రెండో వార్డులోని డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు చేయాలని అధికారులకు సూచించారు. వారి వెంట కౌన్సిలర్లు ఆలూరి శశికిరణ్, కోట్ల ప్రశాంత్‌రెడ్డి, బుక్క మహేశ్, సతీశ్, ఏఈ రవి, టీపీఎస్ మేఘన తదితరులు ఉన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక.. ఇఫ్తార్




జేపీఎన్‌సీఈలో నిర్వహించిన ఇఫ్తార్‌లో పాల్గొన్న కొత్వాల్, రవికుమార్ తదితరులు

**స్టేషన్ మహబూబ్‌నగర్:** రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని జేపీఎన్‌సీఈలో గురువారం చైర్మన్ రవికుమార్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కృష్ణమూర్తి, జూపల్లి భాస్కర్‌రావు, మైనార్టీ నాయకులు అన్వర్‌పాషా, అబ్దుల్ రెహమాన్, మక్సూద్ హుస్సేన్, అవేజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## లోఓల్టేజీ సమస్య పరిష్కారం

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** జిల్లా కేంద్రంలోని మర్లు, రాబియా నగర్, పాలకొండ రోడ్డు ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని పలువురు ట్రాన్స్‌కో అర్బన్ ఏడీ నాయక్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు గురువారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు కాలనీవాసులు మన్మోహన్, వసంత తెలిపారు. లోఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడేవారమని.. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పరిష్కరించడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## సీలింగ్ భూమి ఆక్రమణ

**జడ్చర్ల:** మండలంలోని గంగాపూర్ గ్రామ శివారులో సర్వే నంబర్ 581లో గల సీలింగ్ భూమిని కొందరు ఆక్రమించారని స్థానికులు ఆరోపించారు. దాదాపు రెండెకరాల భూమిని చదును చేసి.. అతిథిగృహం నిర్మిస్తున్నారని తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులు విచారించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ నర్సింగరావును వివరణ కోరగా.. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సెల్‌ఫోన్ అప్పగింత

**దేవరకద్ర:** మండల కేంద్రంలోని కోయిల్‌సాగర్ రోడ్డు చౌరస్తాలో గురువారం పంచాయతీ కార్మికుడు ఏసు విధులు నిర్వహిస్తుండగా.. సెల్‌ఫోన్ దొరికింది. వెంటనే స్థానిక పోలీసులకు ఫోన్ అప్పగించడంతో బాధితుడికి అందజేశారు. నిజాయితీ చాటుకున్న పంచాయతీ కార్మికుడిని ఎస్‌ఐ నాగన్న అభినందించారు.

## కల్వర్టు నిర్మాణం పరిశీలన



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్థానిక 35వ డివిజన్ పరిధిలోని మడుగునగర్‌లో నిర్మిస్తున్న కల్వర్టును గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు. దీనికి సంబంధించి మూడు పెద్ద పైపులను ఏ విధంగా అమర్చుతున్నారో పరిశీలించారు. కాగా, వర్షాకాలంలో సమీపంలోని కొత్తచెరువు నిండితే ఈ ప్రాంతంలో నీరు రోడ్డుపై నిల్వ కాకుండా దీనిని ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈ సందీప్ పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు నాయకుల అరెస్టు

**దేవరకద్ర:** హైదరాబాద్‌లో రైతులకు మద్దతుగా జరిగే ధర్నాకు తరలివెళ్తున్న కమ్యూనిస్టు నాయకులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఆలిండియా స్థాయిలో జరిగే ధర్నాను వాయిదా వేసినప్పటికీ పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారని సీపీఐఎంఎల్ ప్రజాపంథ జిల్లా నాయకుడు సీహెచ్ రాంచందర్ ఆరోపించారు. అరెస్టయిన వారిలో బాలస్వామి, రాజు, కొండారెడ్డి, శివారెడ్డి, దశరథం తదితరులు ఉన్నారు.

## కొనసాగిన రిలే దీక్షలు



**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/జడ్చర్ల టౌన్/ మహబూబ్‌నగర్ రూరల్:** ఎస్సీ రిజర్వేషన్లు ఖరారు చేశాకే ఉద్యోగాల నియామక ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేస్తూ పీయూలో ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మూడో రోజుకు చేరాయి. దీక్షలకు ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ మాలవి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కమలాకర్, గణేశ్, తిరుమలేష్, విజయ, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

■ జడ్చర్ల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగింది. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాకే గ్రూప్స్ నియామకాలు చేపట్టాలని, మంత్రివర్గంలో మాదిగలకు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్యమాదిగ, కరాటే శ్రీను, కొంగళి నాగరాజు, దగ్గుల బాల్‌రాజు, అశోక్ మాదిగ, ఆంజనేయులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు శ్రీరాములు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పోలే బాలయ్య, రామచందర్, కొండయ్య, రాములు, శంకర్, శ్రీను, అంజి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు వితరణ



**దేవరకద్ర:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు నాలుగు సీసీ కెమెరాలను వితరణ చేశారు. 1998–99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సీసీ కెమెరాలతో పాటు పాఠశాల పేరుతో ఉన్న బోర్డు అందజేశారు. అదే విధంగా తమ స్నేహితులు ఆటో బోయరాజుకు రూ. 15వేలు, మంజులకు రూ. 10వేల ఆర్థికసాయం అందించారు.

## బూర్గుల రామకృష్ణారావు సేవలు చిరస్మరణీయం



**జడ్చర్ల టౌన్:** దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు జయంతిని గురువారం పట్టణంలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ప్రిన్సిపల్ డా.సుకన్య మాట్లాడుతూ.. హైదరాబాద్ స్టేట్ తొలి ముఖ్యమంత్రిగా రామకృష్ణారావు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నర్మద, శ్రీనివాసులు, అధ్యాపకులు రాఘవేంద్రారెడ్డి, సదాశివయ్య, నందకిషోర్, మాధురి, సతీష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.